# సేవకు మించిన సాధన లేదు

అంతరాత్మ కన్న అధ్యాపకుడు లేడు
అరయ కాలమె మీకు పరమ గురువు
గ్రంథరాజమేది ప్రత్యక్ష లోకమే
ఎవడు స్నేహితుండు, ఈశ్వరుండె!

భావి పౌరులైన యువతీయువకులారా!

ప్రపంచముయొక్క మంచిచెడ్డలన్నీ మీ ప్రవర్తనపై ఆధారపడియున్నవి. మీ నడత మంచిదిగా ఉన్నప్పుడే దేశము సుభిక్షముగా, సుఖశాంతులతో తులతూగుతుంది. ఈనాడు లోకమునకు కావలసినవి సిరిసంపదలు కావు, భోగభాగ్యములు కావు. గుణవంతులైన స్త్రీపురుషులు కావాలి. స్త్రీ, పురుషుల ప్రవర్తన సరిగా లేకుండిన దేశముయొక్క స్థితి, గతి, సంపత్తి అంతా నాశనమవుతుంది. సత్యమే నీతి, ధర్మమే రీతి, త్యాగమే ఖ్యాతి. ఈ మూడింటి సమ్మిళిత స్వరూపమే మానవజాతి. ఈ మానవజాతి సత్యమునుండియే ఆవిర్భవించింది. దీనిని పురస్కరించుకొనియే ప్రాచీన ఋషులు 'సచ్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం' అన్నారు. మానవుడు నీతిని పోషించుకున్నప్పుడే సమాజములో సమత్వము, స్వేచ్ఛ, సోదరత్వం అభివృద్ధి అవుతాయి. నీతిని పోషించుకోవాలంటే సత్యమును పలకాలి. కనుకనే, 'సత్యం బ్రూయాత్' అన్నారు. ఇది నైతిక విలువ. మీరు పలికే సత్యం అనుద్వేగకరంగా, ప్రియంగా, హితంగా ఉండాలి. అదే ధర్మం. కనుకనే, 'ప్రియం బ్రూయాత్' అన్నారు. ఇది ధార్మిక విలువ. ఇక మూడవది 'న బ్రూయాత్ సత్యమప్రియం'. అప్రియమైన సత్యమును పలుకకూడదు. ఇది ఆధ్యాత్మిక విలువ.

ప్రేమస్వరూపులారా! ప్రాచీనకాలం నుండి అన్ని దేశములకు ఆధ్యాత్మిక తత్త్వమును ప్రచారం చేసినది భారతదేశం. అనాది కాలమునుండి 'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు' అన్నదే భారతదేశముయొక్క ప్రధాన ఆశయం. ఈ దేశమునకు ఉత్తర ప్రాంతమున హిమాచలము సరిహద్దుగా ఉన్నది. హిమము చల్లనిది, తెల్లనిది. చల్లదనము ప్రశాంతతకు, తెల్లదనము నిర్మలత్వమునకు చిహ్నములు. 'భారత' అనే పదములో 'భా' అనే అక్షరం భావమును, 'ర' రాగమును, 'త' తాళమును సూచిస్తున్నాయి. అనగా భావ, రాగ, తాళములతో భగవంతుని భజించేవారే భారతీయులని అర్థము. భా- వెలుగు, కాంతి, ప్రకాశము అనే అర్థములుకూడా ఉన్నవి. కనుక, భారతీయులనగా వెలుగును ఆశించేవారు, వెలుగును అందించేవారని కూడా చెప్పవచ్చును. కనుక, 'నేను భారతీయుడను' అన్నదే మీకున్న గొప్ప క్వాలిఫికేషను. మీరు కేవలం జన్మచేత మాత్రమే కాకుండా ఆచరణలో కూడా భారతీయులని నిరూపించుకోవాలి.

భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తించాలి.

యువతీయువకులారా! చూడండి, ఇక్కడ ఎన్నో బల్బులు వెలుగుతున్నాయి. బల్బులు విడివిడిగా కనిపించినప్పటికీ వాటిలో ప్రసరించే కరెంటు ఒక్కటే కదా! అట్లే, దేశములు వేరు కావచ్చు, దేహములు వేరు కావచ్చు, భావములు వేరు కావచ్చు కాని, అందరియందున్న ఆత్మతత్త్వం ఒక్కటే. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించి పవిత్రమైన సేవలో పాల్గొన్నప్పుడే మీరు ఆనందాన్ని అనుభవించగలరు. మానవులు విడిచిన బొగ్గుపులుసు వాయువును వృక్షములు పీల్చుకొని ప్రాణవాయువును అందిస్తున్నాయి. సూర్యుడు వెలుతురును అందించి జీవితాలను కాపాడుతున్నాడు. భూమి ఫలాపేక్షా రహితంగా పంటలను పండిస్తున్నది. ఇట్టి భూమాత ఒడియందు పుట్టి మీరు భూమాతయొక్క త్యాగాన్ని అర్థంచేసుకోలేకపోతే ఏమి ప్రయోజనం? తల్లి ఒడియందు జీవితాన్ని గడుపుతూ తల్లియొక్క తత్త్వాన్ని గుర్తించుకోలేకపోవటం ఎంతటి దురదృష్టం! నిస్వార్థ ప్రేమకు ప్రతిరూపమైన

ప్రకృతియందు పుట్టి మీరు స్వార్థంతో జీవించడం చాలా పొరపాటు. స్వార్థస్వప్రయోజనములను త్యజించాలి. *all are one my dear son, be alike to every one.* అన్నాడు జీసస్. ఎవ్వరినీ నొప్పించకూడదు. 'నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు' అన్నారు. అందరూ ఒక తల్లి బిడ్డలే. అందరూ నివసించే భూమి ఒక్కటే. అందరూ పీల్చే గాలి ఒక్కటే. అందరూ ఏదో ఒకనాడు ప్రాణం విడిచేవారే. ఇలాంటి ఏకత్వాన్ని గుర్తించి భిన్నత్వాన్ని దూరం చేసుకోవాలి. ఇదే ఈనాటి యువతీయువకులు చేయవలసింది.

ధ్యానము ఇంద్రియాతీతమైనది.

'మేము గ్రామసేవలు చేస్తున్నాం, బీదలకు సేవ చేస్తున్నాం' అని గొప్పలు చెప్పుకోవటం చాలా పొరపాటు. సేవచేయటం మీ కర్తవ్యము. మానవుడు పుట్టింది సేవకోసమే. సేవకోసం పుట్టి నాయకత్వమును ఆశించటం చాలా పొరపాటు. సేవకుడే నిజమైన నాయకుడు. కనుక, దీనులకు, దిక్కులేనివారికి తగిన సేవలు చేసి వారిని అభివృద్ధికి తెప్పించాలి. అదియే నిజమైన సాధన. జపము, ధ్యానము, యోగము ఇలాంటివన్నీ ప్రాకృతమైన సాధనలు. అసలు మెడిటేషన్ అంటే ఏమిటి? మీరు దేవుని గురించి మెడిటేషన్ చేస్తున్నామంటున్నారు. కాని, అసలు దేవుడంటే ఎవరో మీకు తెలియనప్పుడు దేవుని గురించి ఏరీతిగా మీరు మెడిటేషన్ చేయగలరు? రాముడు దేవుడా? కృష్ణుడు దేవుడా? జీసస్ దేవుడా? అల్లా దేవుడా? అందరూ దైవస్వరూపులే! చాలామంది ధ్యానం చేస్తున్నామని కళ్ళు మూసుకొని కూర్చుంటారేగాని, అసలు ధ్యానమంటే ఏమిటో గుర్తించటం లేదు. ధ్యానమంటే కాన్సన్ట్రేషన్ అని భావిస్తున్నారు. అది చాలా పొరపాటు. కాన్సన్ట్రేషన్ ఇంద్రియ సంబంధమైనది. కాని, మెడిటేషన్ ఇంద్రియాతీతమైనది. దైవభావనతో ఏది చేసినా అది ధ్యానమే! ప్రేమతో ఏ పని చేసినా అది ధ్యానమే! ప్రేమ లేకుండా మీరు కళ్ళు మూసుకొని గంటలకొద్దీ కూర్చున్నా అది ధ్యానం కానేరదు. ప్రేమయే దైవం కాబట్టి, ప్రేమ తత్త్వాన్ని తెలుసుకోకుండా మీరు ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. ప్రేమ లేని హృదయం మరుభూమి వంటిది. కనుక, ప్రేమను పెంచుకోవాలి. ఎటువంటి ప్రేమ? లౌకిక ప్రేమ కాదు. ఆత్మసంబంధమైన ప్రేమను పెంచుకోవాలి. అందరియందున్న ఆత్మ ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించాలి. అయితే, ఈ స్థాయి అందరికీ అంత సులభంగా లభ్యం కాదు. క్రమక్రమేణా సాధనచేత ఆ స్థాయిని చేరుకోవటానికి ప్రత్నించాలి.

ఇంద్రియ నిగ్రహం లేని సాధన నిరర్థకం

పుట్టిన తక్షణమే మీరు డిగ్రీలో చేరటానికి వీలవుతుందా? మొదటి తరగతి నుండి ప్రారంభించి క్రమక్రమేణ డిగ్రీస్థాయికి చేరుకోవాలి. అదేవిధంగా, ఈ ప్రాకృతమైన సాధనలను మీరు చేయవలసిందే! ఎంతవరకు? నివృత్తిస్థాయిని చేరుకునేంత వరకు అవి అవసరం. నివృత్తిస్థాయిని చేరుకున్న తరువాత వాటిని వదలిపెట్టవలెను. అయితే, ఇంద్రియ నిగ్రహం లేకుండా ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. ఇంద్రియ నిగ్రహంచేత మానవత్వం దైవత్వంగా మారిపోతుంది. కనుక, మొట్టమొదట ఇంద్రియాలను నిగ్రహించుకోండి. కోపం, చంచలత్వం మున్నగు దుర్గుణాలు మీకు సహజం కాదు. కోపం కుక్క లక్షణం, చంచలత్వం కోతి లక్షణం. కనుక, మీకు కోపం వచ్చినప్పుడు, 'నేను కుక్కను కాను, నేను మనిషిని' అని పదేపదే జ్ఞప్తికి తెచ్చుకోండి. మీ మనస్సులో చంచలత్వం బయల్దేరినప్పుడు, 'నేను కోతిని కాదు, నేను మనిషిని' అని పదేపదే మిమ్మల్ని మీరు హెచ్చరించుకోండి. కుక్క లక్షణాలను త్యజించకుండా మీకు మానవతా విలువలు కావాలంటే ఎట్లా లభ్యమౌతాయి.

విశ్వాసంనుండియే ఆనందం ఆవిర్భవిస్తుంది.

సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మానవతా విలువలు. వాటిని మీ పంచప్రాణములైన ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములతో పోల్చవచ్చును. ఈనాటి మానవుడు ఈ 'పంచప్రాణముల'ను కోల్పోయి

జీవచ్ఛవంవలె కాలాన్ని గడుపుతున్నాడు. మీరు సత్యమును పలుకకపోతే మీలో ఒక ప్రాణం పోయినట్లే! ధర్మమును ఆచరించకపోతే రెండవ ప్రాణంకూడా పోయినట్లే! ప్రేమ లేకుండా కఠినంగా ప్రవర్తిస్తే మూడవ ప్రాణం కూడా పోయినట్లే! ఈ మూడూ పోయిన తరువాత మీకు శాంతి ఎట్లా లభిస్తుంది! ఈ నాలుగూ లేనిచోట అహింస ఏవిధంగా నిలుస్తుంది! విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ. ప్రేమ ఎక్కడో శాంతి అక్కడ. శాంతి ఉన్నచోటే సత్యం ఉంటుంది. సత్యం ఉన్నచోటే దైవం ఉంటాడు. దైవం ఉన్నచోటే ఆనందం ఉంటుంది. కనుక, విశ్వాసం నుండియే ఆనందం లభ్యమౌతుంది. మానవుడు ఆనందాన్ని ఆశిస్తున్నాడు. కాని, అది అంత సులభంగా లభ్యమయ్యేది కాదు. ఆనందం బ్రహ్మస్వరూపం. అట్టి ఆనందమును అనుభవించాలంటే ఎంతో కష్టపడాలి. అయితే, అది శరీరంతో పడే కష్టం కాదు. మొట్టమొదట హృదయంలో ఉన్న దుర్గుణాలను, దురాలోచనలను త్యజించాలి. సద్గుణాలతో, సదాలోచనలతో హృదయాన్ని నింపుకోవాలి. హృదయం భగవంతుడు నివసించే స్థానం. దానిని దుర్గుణాలతో భ్రష్టు పట్టించుకోకూడదు. హృదయంలో ఉన్న మాలిన్యాన్ని నిర్మూలించుకోవాలంటే కొంత సాధన చేయాలి. ప్రయత్నం చేయక ఏ కార్యమూ ఫలించదు. ఒక చిన్న ఉదాహరణ. చెట్టుపైనున్న ఫలమును మీ కన్నులు చూచాయి. అయితే, చూచిన తక్షణమే ఫలము లభిస్తుందా? లేదు. ఆ చెట్టు సమీపానికి పోవాలి. నడుమును వంచాలి. చేతితో ఒక రాయిని తీసుకోవాలి. ఆ ఫలం క్రింద పడేటట్లుగా రాయిని విసరాలి. ఫలం క్రింద పడిన తరువాత దానిని వ్రేళ్లతో అందుకోవాలి. నోటిలో పెట్టుకోవాలి. పండ్లతో నమలాలి. గొంతు ద్వారా మ్రింగాలి. చూచారా! ఒక చెట్టుపైనున్న ఫలము మీ పొట్టలోకి చేరటానికే ఇంత ప్రయత్నం అవసరమైతే బ్రహ్మస్వరూపమైన ఆనందాన్ని అనుభవించటానికి ఇంకెంత ప్రయత్నం అవసరమో మీరు యోచించుకోవచ్చును. అందుకోసమే ఈ కాయము అందించబడింది. 'శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం'. ధర్మాన్ని ఆచరించే నిమిత్తమే శరీరం వచ్చిందిగాని, కేవలం తిని, తిరిగి, చావటానికి కాదు. మానవ దేహాన్ని ధరించినందుకు మీరీ జగత్తుకు ఒక ఆదర్శమును అందించాలి.

ముక్తికి మార్గం

ఈనాటి మానవునకు జపంచేసినా, తపంచేసినా, ధ్యానంచేసినా అన్నీ తన స్వార్థంకోసమే చేస్తున్నాడుగానీ పరార్థంకోసం చేయటం లేదు. స్వార్థంతో ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. మీరు దేవుని దర్శించటంకోసం ధ్యానం చేస్తున్నామని చెబుతున్నారు. కాని, దేవుని కేవలం మీరు మాత్రమే దర్శిస్తే సరిపోదు. సమస్త జగత్తుకు ఆ ఆనందాన్ని అందించాలి. భగవంతుని స్మరించుకుంటూ సేవలో పాల్గొనండి. శక్తిహీనునికి సేవ చేసేటప్పుడు అతనే దైవం అనుకోండి. ఒక శవాన్ని, ఒకరోగిని, ఒక వృద్ధుని చూసే సరికి బుద్ధుని మనస్సు చాలా మారిపోయింది. బాధ పడేవారిని చూచి అతని హృదయం కరిగిపోయింది. కాని, మీరు ఎన్ని శవాలు చూచారో! ఎంతమంది రోగులను చూచారో! ఎంతమంది వృద్ధులను చూచారో! అయినప్పటికీ మీ మనస్సు మారటం లేదు. మీ హృదయం కరగటం లేదు. మీకు ముకి& ప్రాప్తించాలంటే మీరు ప్రేమలో లీనమైపోవాలి. సత్యధర్మాలను అనుసరించాలి. bend the body, mend the senses, end the mind. మనస్సును నిర్మూలించుకోవాలి. మనస్సు నిర్మూలం కావాలంటే ఇంద్రియాలను అరికట్టుకోవాలి. మీ ప్రవర్తన సంకల్పములపై ఆధారపడియున్నది. సంకల్పములే మనస్సుగా మారుతున్నది. కనుక, మొట్టమొదట మీ సంకల్పములన్నీ సత్యసంకల్పములుగా రూపొందాలి. అప్పుడే మనస్సు నిర్మూలమవుతుంది. ఈనాడు లోకం ఉండవలసిన రీతిగా లేకపోవటానికి కారణం ఏమిటి? మీ సంకల్పములు ఉండవలసిన రీతిగా లేవు.

అత్యున్నతమైన సాధన

మీరు ఉదయం నిద్దురనుండి లేచినది మొదలు తిరిగి రాత్రి నిద్దురపోయెదుదాక పొట్టకోసం హద్దు, పద్దు

లేక అనేకవిధాలుగా పాటుపడుతున్నారు. ఇంక, మీరు దైవాన్ని స్మరించేదెప్పుడు? దైవాన్ని స్మరించకపోతే మీకు పవిత్రత ఎలా లభిస్తుంది? పవిత్రత ప్రాప్తించాలంటే మీరు చేసే ప్రతి పనిని భగవంతుని పనిగా భావించాలి. whatever you do, do it as God's work. సర్వకాల సర్వావస్థలయందు భగవంతుని స్మరించాలి. ఒక చిన్న ఉదాహరణ. మీరు శ్వాస తీసుకునేటప్పుడు 'సో..' అనే శబ్దం, శ్వాస వదిలేటప్పుడు 'హం..' అనే శబ్దం వెలువడుతున్నవి. 'సో..' అనగా అది, 'హం..' అనగా నేను. కనుక, 'సోహం' అనగా 'నేనే దైవం' అని అర్థం. ఇంతకంటే, వేరే సాధన అక్కర్లేదు. దినమునకు 21,600 పర్యాయములు మీ అంతర్వాణి 'నేనే దైవం' అనే సత్యాన్ని బోధిస్తుంటే, దానిని మీరు ఏమాత్రమూ లక్ష్యం చేయటం లేదు. మీ దేహము ప్రాణాధారమైన ఆక్సిజన్‌ను పీల్చుకొని విషపూరితమైన కార్బన్‌డైయాక్సైడ్‌ను వదలుతున్నది. అదేవిధంగా, మీరు మంచిని లోనికి తీసుకొని, చెడ్డను వదలిపెట్టాలి. 'ఫలము'ను స్వీకరించి, 'మలము'ను విసర్జించాలి.

నెగిటివ్ – పోజిటివ్

చెవి, చేయి, ముక్కు, నోరు మున్నగునవి దేహముయొక్క అంగములు. అనేక దేహములతో కూడినది సమాజము. కనుక, దేహము సమాజమునకు అంగము. సమాజము మానవత్వమునకు అంగము. మానవత్వము ప్రకృతికి అంగము. ప్రకృతి పరమాత్మకు అంగము. ఈ ప్రపంచములో ఎక్కడ చూచినా అన్నీ అంగాంగముల సమూహమే. అన్నింటికీ మధ్య సంబంధం ఉంటున్నది. ఆ సంబంధం లేకుండా ప్రపంచమే ఉండటానికి వీల్లేదు. ఎక్కడో అమెరికాలో ఉన్నప్పటికీ, ఇక్కడ ఇండియాలో ఉన్నప్పటికీ ఈ సంబంధం ఉంటున్నది. టెలివిజన్ల మధ్య, టెలిఫోన్ల మధ్య సంబంధం ఉన్నప్పుడు మనుష్యుల మధ్య సంబంధం ఉండటంలో ఆశ్చర్యమేమున్నది! యంత్రాలది కల్పితమైన సంబంధము, మానవులది సహజమైన హృదయ సంబంధము. number call, particular person call అనేవి రెండు వుంటున్నాయి. number call చేస్తే అవతలవైపు ఎవరైనా మాట్లాడవచ్చు. కాని, particular person call చేస్తే మీరు ఎవరితో మాట్లాడదల్చుకున్నారో వారు మాత్రమే వచ్చి మాట్లడుతారు. ప్రాపంచికమైన నెగిటివ్ భావం number call వంటిది. i want God, particular person call వంటిది. మీకు భగవంతుడు కావాలనే ప్రగాఢమైన వాంఛ ఉన్నప్పుడు భగవంతుడే వచ్చి మీతో మాట్లాడుతాడు. అట్లుగాకుండా, మీరు నెగిటివ్ భావాలనే 'నెంబరు కాల్' చేస్తే భగవంతుడు మీతో మాట్లాడటానికి వీలుకాదు. దేహమొక నెగిటివ్, మనస్సొక నెగిటివ్, మీ వాంఛలన్నీ నెగిటివ్. కాన్షయన్స్ ఒక్కటే పోజిటివ్. దానిని ప్రధానంగా తీసుకోండి.

కార్యకారణ సంబంధము

సాధన అనగా జపం, ధ్యానం చేయటం కాదు. ఏ పనిచేసినా దైవసేవగా భావించటమే నిజమైన సాధన. every work is God's work. God is everywhere. దీనిని పుస్కరించుకొనియే భగవద్గీత చెప్పింది–

సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష&ఠతి.

'నేనీ పని చేస్తునట్లు ఎవ్వరికీ తెలియదు' అనుకుంటావు. చాలా పొరపాటు. భగవంతుడు చూస్తూనే ఉన్నాడు. కన్నుల్లో వెలుగు ఉన్నట్లుగా, భగవంతుడు నీలోనే ఉన్నాడు. సర్వమునకు భగవంతుడే ఆధారం. భగవత్సంకల్పము లేనిదే గడ్డిపోచ కూడా కదలదు. పిపీలికాది బ్రహ్మపర్యంతం తాను వ్యాపించియున్నాడు. కాని, ఈ సత్యాన్ని గుర్తించుకోలేక కొంతమంది తాము గొప్ప వివేకవంతులమని, ఎన్నో ఘనకార్యాలు చేస్తున్నామని అహంకారపడుతుంటారు. చేయించేది, అనుభవించేది, ఆనందించేది అంతా ఆ భగవంతుడే అని గుర్తించండి. మీకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా మీ మంచికే అని భావించండి. అప్పుడు అంతా మీకు మంచియే

జరుగుతుంది. వైద్యుడు మలేరియా జ్వరం వచ్చినవానికి చేదుగా ఉండే క్వినైన్ మందు యిస్తాడు. ఆ చేదు మందును త్రాగినప్పుడే వచ్చిన జ్వరం నివారణ అవుతుంది. అదేరీతిగా, మీకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా మీ రోగ నివారణకే అని గుర్తించండి. ప్రతి కార్యమునకు ఒక కారణం వుంటుంది. భగవంతుడు కారణంలేని కార్యం ఏదీ చేయడు. కార్యకారణ సంబంధాన్ని గుర్తించుకోలేక మానవుడు 'దేవుడు నన్ను బాధపెడుతున్నాడు' అని భావిస్తాడు. దేవుడు ఎవరినీ బాధపెట్టడు. చేసేదీ తానే, అనుభవించేదీ తానే. ఈ సత్యాన్ని మానవుడు గుర్తించాలి.

అనుకరణ జంతు లక్షణం

ఈనాటి యువతీయువకులకు కోరికలు మితిమీరిపోతున్నాయి. కోరికలనే లగేజిని ఎంత తగ్గించుకుంటే జీవిత ప్రమాణం అంత సవ్యంగా సాగుతుంది. మితిమీరిన కోరికలవల్ల శారీరకంగా మాత్రమేగాక మానసికంగాకూడా ఎంతో శ్రమ పడవలసివస్తుంది. తినటానికి తిండి ఉండాలి. త్రాగటానికి నీరు ఉండాలి. కట్టడానికి బట్ట ఉండాలి. 'భిక్షాన్నం దేహరక్షార్థం, వస్త్రం శీతనివారణం'. వస్త్రములు అలంకారంకోసం కాదు. ఈనాటి యువతీయువకులు ఫ్యాషన్ డ్రస్సులంటే చాలా మోజుపడుతున్నారు. సినీమాలను చూచి వాటిని అనుకరిస్తున్నారు. అనుకరణ జంతు లక్షణం. ముఖ్యంగా ఆడవారు ఫ్యాషన్‌లకు దూరంగా ఉండాలి. ఒంటి నిండుకు బట్టలు వేసుకోండి. పొట్ట నిండుకు తిండి తినండి. దానికి ఎవ్వరూ అడ్డుచెప్పరు. ఇంద్రియాలను నిగ్రహించుకోవాలంటే వాంఛలను అరికట్టుకోవాలి. అప్పుడే మీకు దైవత్వం ప్రాప్తిస్తుంది. పతంజలి, 'యోగః చిత్తవృత్తి నిరోధః' అని చెప్పాడు. చిత్తవృత్తులను అరికట్టుకోవటమే నిజమైన యోగం. వాటిని విచ్చలవిడిగా విడిచిపెట్టటంచేతనే మానవుడు రోగాలకు గురి అవుతున్నాడు. మీరు యోగులు కావాలి. భోగంలో యోగం రాదు. యోగంలో రోగం రాదు. యోగమనగా సర్వసంగ పరిత్యాగం చేసి అరణ్యానికి పోవటం కాదు. యోగమనగా చేరిక అని అర్థం. మీ ప్రేమను దైవంతో చేర్చటమే నిజమైన యోగం.

శరణాగతి తత్త్వం

భగవంతుడు దేనినీ ఆశించడు. 'నాయనా! నీవు యోగంచేయి, ధ్యానంచేయి అప్పుడే నాకు సంతోషం కలుగుతుంది' అని ఎప్పుడూ చెప్పడు. మీరు ప్రేమహృదయులుగా, శాంతహృదయులుగా, త్యాగహృదయులుగా, సత్యహృదయులుగా తయారుకావాలని భగవంతుడు ఆశిస్తుంటాడు. మీరు భగవంతుని ఆదేశాలను ఆచరణలో పెట్టినప్పుడు, మీకు ఏ సమయమునకు ఏది అవసరమో మీరు అడగకుండా అన్నీ తానే అందిస్తాడు.

అడుగకువె ఓ మనసా
అడుగు కొలది అది అడుగున పడునని
అడుగకున్న పని వడిగానగునని ॥అడు॥
అడుగని శబరిని ఆదరించడే
అడుగక తనకై మడియు జటాయువు
కడకునేగి సద్గతి కల్గించడే ॥అడు॥

మీరు అడుగనక్కరలేదు. అన్నీ తానే చూచుకుంటాడు. పసిబిడ్డ ఆకలైనప్పుడు, 'అమ్మా! నాకు పాలు కావాలి' అని అడుగడు కదా! అటువంటిదే శరణాగతి కూడా. ఇది కావాలి అని కోరికలు పెట్టుకుంటే మీరు దైవానికి దూరమైపోతారు. అది కావాలి, ఇది కావాలి అని విసిగించే పిల్లవానికి తల్లి ఏమి చెబుతుంది? 'వంటవానిని పోయి అడుగు, పెడతాడు' అంటుంది. అడుగలేని చంటిబిడ్డకు తానే స్వయంగా వెళ్ళి పాలు త్రాపుతుంది. అడగటం అహంకార తత్త్వము. కేవలం ప్రాపంచికమైన జీవితాన్ని గడిపేవాడే 'అది కావాలి, ఇది కావాలి' అని అడుగుతుంటాడు. ఏమీ అడుగక నిశ్చింతగా నిద్రించే పసిబిడ్డకు ఏ సమయానికి ఏది కావాలో అన్నీ తల్లియే చూసుకుంటుంది. అదేవిధంగా, ఏ చింతలూ లేక దైవచింతన చేసేవాని యోగక్షేమాలను భగవంతుడే

చూసుకుంటాడు.

చేతిలో పని, మనస్సులో దైవం

ఝున్సీ లక్ష్మీబాయి యుద్ధానికి బయలుదేరినప్పుడు తన చంటిబిడ్డను వీపుకు కట్టుకుంది. చేతిలో కత్తి పట్టుకొని గుఱ్ఱంపై ఎక్కి యుద్ధం చేసింది. యుద్ధసమయంలో కూడా ఆమె తల్లిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించింది. యుద్ధం చేసినంతసేపూ ఆమె మనస్సు తన బిడ్డపైనే ఉన్నది. అదేవిధంగా, ఈ జగత్తులో మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తిస్తూ లక్ష్యాన్ని మాత్రం దైవంవైపు పెట్టుకోవాలి. మీకు తెలుసు – నర్తకి కళ్ళు త్రిప్పుతూ, చేతులు త్రిప్పుతూ అనేకవిధాలుగా అభినయం సల్పుతుంది. కాని, ఎన్నివిధాలుగా అభినయం సల్పినప్పటికీ తాళమును మాత్రం తప్పదు. అదేవిధంగా, మీరీ జగత్తులో భౌతికమైన జీవితమును గడుపుతున్నప్పటికీ మీ మనస్సును మాత్రం దైవంపై ఉంచుకోవాలి. hands in the society, head in the forest. ఇదే మీరు చేయవలసినది. చేతితో పనిచేయండి, మనస్సుతో దైవాన్ని చింతించండి. దైవచింతనకు ప్రత్యేకమైన కాలం అవసరం లేదు. ప్రత్యేకమైన సాధనలను కూడా మీరు చేయనక్కరలేదు. ఏ పని చేస్తున్నా దైవాన్ని చింతించండి.

ఆహారాన్ని వ్యర్థం చేయటం మహాపాపం

ప్రేమస్వరూపులారా! మీరు భుజించే ఆహారము పరిశుద్ధమైనదిగా ఉండాలి. మద్యపానం, మాంసభక్షణ, ధూమపానం మున్నగు దుర్వ్యసనములకు దూరంగా ఉండాలి. ధనమును, ఆహారమును, కాలమును, శక్తిని వృథాచేయకూడదు. ఈనాడు ప్రపంచములో ఎంతోమంది తినడానికి తిండి లేక చాలా కష్టపడుతున్నారు. తినగల్గినంత తినండి. తప్పు లేదు. ఎంత తినగలరో అంత పెట్టించుకోండి. అంతేగాని, వడ్డించినవి వదలిపెడితే వాటిని బయట పారవేయవలసి వస్తుంది. మీరూ తినకుండా, ఇతరులకీ పెట్టకుండా ఆహారాన్ని వ్యర్థం చేయటం మహాపాపం. మీకు తెలుసు. ఒరిస్సాలో వరదబాధితులీనాడు పిడికెడు అన్నంకోసం ఎంత కష్టపడుతున్నారో! మీకు తెలియకపోవచ్చుగాని, ఇప్పుడు వారికి తెలుసు అన్నముయొక్క విలువ. కనుక, ఆహారాన్ని వ్యర్థంచేయకండి.

ధనము, కాలము సద్వినియోగం కావాలి.

ఈనాటి పిల్లలు స్నేహితులతో హోటళ్ళకు వెళ్ళి, పేకాటలాటలాడి, జూదమాడి చాలా డబ్బును వ్యర్థం చేస్తున్నారు. విద్యార్థులారా! ధనమును దుర్వినియోగపరచకండి. మీ పనులు మీరు చేసుకోండి. ఇతరులపై ఆధారపడకంఢి. సమయం చిక్కినప్పుడు మీ గుడ్డలు మీరే ఉతుక్కోవచ్చు కదా! వాటిని చాకలికి వేసి మీ తండ్రి సంపాదించిన ధనమును అనవసరంగా ఖర్చుపెట్టడమెందుకు! మీరు సంపాదించినా, తల్లిదండ్రులు సంపాదించినా ధనమును వ్యర్థంచేయకూడదు.

కాలం భగవత్స్వరూపం. 'కాలాయనమః, కాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః ,కాలాతీతాయనమః...' అని భగవంతునికి అనేక పేర్లున్నాయి. కనుక, కాలాన్ని వ్యర్థంచేస్తే జీవితాన్నే వ్యర్థం చేసినట్లవుతుంది. కాలాన్ని వేస్ట్ చేయకండి. దివ్యత్వాన్ని టేస్ట్ చేయండి. సమయం చిక్కినప్పుడల్లా దైవనామాన్ని స్మరించండి.

మాటలు తగ్గించి పని ఎక్కువ చేయండి

శక్తి భగవత్స్వరూపం. కనుక, శక్తిని వృథాచేయకండి. చెడ్డ దృశ్యాలను చూడటంవల్ల, చెడ్డమాటలు మాట్లాడటంవల్ల, చెడ్డ విషయాలను వినటంవల్ల మీలో ఉన్న శక్తి ఎంతో వ్యర్థం అవుతున్నది. మీరు రేడియోలో ఏదైనా ప్రోగ్రాం విన్నప్పుడు ఎన్నో యూనిట్ల కరెంటు ఖర్చవుతుంది కదా! అదేరీతిగా, మీరు అధికంగా మాట్లాడటంవల్ల మీలో శక్తి అధికంగా ఖర్చవుతుంది. కనుకనే, ప్రాచీన మహర్షులు మౌనం పాటించేవారు. మీరుకూడా కనీసం వారానికి ఒకరోజైనా మౌనం పాటించాలి. నేను అనేక పర్యాయములు పిల్లలకు

చెపుతుంటారు. మాటలు తక్కువ, పని ఎక్కువ చేయాలి. తక్కువగా మాట్లాడటం వలన మీ శక్తి చాలా పెరిగిపోతుంది. తద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రతకూడా అభివృద్ధి అవుతాయి. ఎనర్జీ క్షీణించటం వలన జ్ఞాపకశక్తి, శారీకశక్తికూడా కూడా క్షీణించిపోతాయి. కొందరు విద్యార్థులు పరీక్షలలో సరిగా వ్రాయలేకపోవటానికి కారణం ఏమిటి? వారిలో జ్ఞాపకశక్తి క్షీణించిపోయింది. ఎందుచేత? ఒకవైపున చదువుతుంటారు, ఒకవైపున న్యూస్‌పేపరు చూస్తుంటారు, ఒకవైపున రేడియోలో క్రికెట్ కామెంట్రీ వింటుంటారు. ఈవిదంగా, ఏకాగ్రత లేకుండా చదివితే చదివినది ఎలా జ్ఞాపకం ఉంటుంది! ఈనాటి విద్యార్థులు దురభ్యాసములచేత తమ శక్తిని పాడుచేసుకుంటున్నారు. వారిలో ఏకాగ్రత క్షీణించిపోయింది. ప్రాచీనకాలంలో పేపర్లు లేవు, పెన్నులు లేవు. ఆనాటి విద్యార్థులు ఆశ్రమాల్లో గురువులు చెప్పింది ఏకాగ్రతతో విని హృదయంలో చిరస్థాయిగా నిల్పుకునేవారు. ఈనాడు పుస్తకాలు, పేపర్లు, పెన్నులు అన్నీ ఉన్నాయిగాని, విద్యార్థులలో జ్ఞాపకశక్తి ఏమాత్రమూ లేదు. పూర్వం ఏదైనా షాపులో కొన్ని వస్తువులు కొంటే, వ్యాపారస్థుడు వాటి మొత్తం వెలను క్షణంలో కూడికవేసి చెప్పగలిగేవాడు. కాని, ఈనాడు ఏ చిన్న కూడిక చేయాలన్నా కేలిక్యులేటర్‌ను వత్తుతున్నారు. భగవంతుడిచ్చిన మెదడును ఎందుకు ఉపయోగించుకోకూడదు! మెదడే నిజమైన కంప్యూటర్.

యూనిటీ, ప్యూరిటీ, డివినిటీ

యువతీయువకులారా! మొట్టమొదట మీర వీశారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులను పోషించుకోండి. ఈ మూడింటినీ మీరు పోషించుకుంటే మిమ్మల్ని మించిన దైవం లేదు. మీ శరీరాన్ని మంచికార్యాలలో ప్రవేశపెట్టండి. మనస్సులో సత్సంకల్పాలకు చోటివ్వండి. మీ బుద్ధిని భగవంతునిలో ఇమడ్చండి. దేహము, మనస్సు, బుద్ధి ఇవన్నీ పనిముట్లు. వీటిని నడిపించేది ఒకటుంది. దానిని గుర్తించండి. ఇతరులపై ఆధారపడకండి. ఒక్క భగవంతుడు మాత్రమే మీకు సహాయం చేయగలడు. అతని పనే అది. మీరుకూడా ఎల్లప్పుడూ సహాయమే చేయండి. ఎవ్వరినీ బాధపెట్టకండి. ఇదే రామాయణ, భారత, భాగవతాది సద్గ్రంథముల సారము. మీలో మీరు జగడాలు వేసుకోకండి. ఐకమత్యమే మహాబలం. యూనిటీ, ప్యూరిటీ, ఎక్కడో, డివినిటీ అక్కడ. మీ హృదయం పవిత్రంగా ఉంటే మీరు ఏది కోరినా అది తక్షణమే లభిస్తుంది. ఉదాహరణకు, మీరు పెన్ను కావాలనుకుంటే, తక్షణమే అది జేబులోకి వస్తుంది. తప్పక వస్తుంది, వస్తుంది. పవిత్రమైన హృదయమే ఉంటే మీరు జగత్తులో సాధించలేనిది ఉండదు.

మిమ్మల్ని మీరు తెలుసుకోండి

దైవాన్ని తెలుసుకోవడం ఎవరి తరమూ కాదు. నిన్ను నీవు తెలుసుకోలేనప్పుడు ఇంక దైవాన్ని ఏరీతిగా తెలుసుకోగలవు? పుట్టపర్తికి వచ్చేవారు దైవాన్ని తెలుసుకోవడానికి వస్తున్నారని ఉమాభారతి తన ప్రసంగంలో చెప్పింది. కాని, దైవం ఎటువంటి వాడు, ఎట్లా ఉంటాడు అనేది తెలుస్తే కదా తెలుసకోవటానికి వీలయ్యేది. కాబట్టి, దైవాన్ని తెలుసుకోవడానికి మీరు ఇక్కడకు రానక్కర్లేదు. అలాంటి ఉద్ధేశ్యంతో ఇక్కడికి వచ్చినా ప్రయోజనం లేదు. మొట్టమొదట మిమ్మల్ని మీరు తెలుసుకోవడానికి ప్రయత్నం చేయండి. మీరు వచ్చింది మిమ్మల్ని మీరు తెలుసుకోవడానికే! నన్ను తెలుసుకోవడం ఎవరి తరమూ కాదు.

దుష్యంతుడు – భరతుడు

శకుంతల కణ్వ మహర్షి ఆశ్రమంలో గురువును ఆశ్రయించి సాధన చేస్తుండేది. ఒకనాడు దుష్యంతుడు ఆశ్రమానికి వచ్చాడు. శకుంతలను చూసి ఆమెను వివాహమాడాడు. ఆమేకు పుట్టిన కుమారుడే భరతుడు. ఆ భరతుని తత్వానికి, అతని తండ్రియైన దుష్యంతుని తత్వానికి ఎంత భేదముంది! దుష్యంతుడు మహారాజు. అతడు పట్టణంలో చదువుకున్నాడు. కాబట్టి, అతనికి అన్నీ పట్టణపు అలవాట్లే వచ్చాయి. భరతుడు ఆశ్రమవాసి. అతడు

ఆశ్రమ వాతావరణంలో పుట్టి, పెరిగి, ఆశ్రమ విద్యను అభ్యసించటంచేత శీలమును పోషించుకోగలిగాడు. ఆశ్రమమనగా శ్రమ లేనిది. అట్టి ఆశ్రమ విద్యలను యువతీయుకులు నేర్వాలి. కాని, ఈనాటి యువతీయువకులు కాలేజీలలో అనవసరమైన సంబంధబాంధవ్యాలను పెంచుకొని మనస్సును మాలిన్యపరచుకుంటున్నారు. కాలేజీలకు వెళ్ళేవారు చదువుపైన తప్ప ఇతర విషయాలపై దృష్టి పెట్టకూడదు. అప్పుడే చదువుతో పాటు శీలమును కూడా పోషించుకో గల్గుతారు. మన పూర్వీకులు శీలమునకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చేవారు. వారు ధనం పోతే ఏమీ పోనట్లు, ఆరోగ్యం పోతే ఏదో కొంత పోయినట్లు, శీలం పోతే అంతా పోయినట్లు భావించేవారు. కాని, నేటి యువతీయువకులు శీలం కంటే ధనానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. శీలం పోతే ఏమీ పోనట్లుగా భావిస్తున్నారు. ధనం పోతే అంతా పోయినట్లుగా భావిస్తున్నారు.

స్వామికి ప్రియమిత్రులెవరు?

యువతీయువకులారా! నేను అధికంగా మాట్లాడి మిమ్మల్ని శ్రమపెడుతున్నానేమో! నేను ఈవిధంగా మంచి విషయాలు ఎంతసేపైనా మాట్లాడగలను. ఎవరికైనా ఉపయోగపడే మాటలు ఎన్నైనా మాట్లాడతాను. నిరుపయోగమైన మాటలు నేను మాట్లాడను. మీరు చాలా పవిత్రమైన జీవితాన్ని గడపవలసినవారు. సత్యసాయి సంస్థల బాధ్యత ముమ్ముందు మీరే నిర్వహించవలసి ఉంటుంది. మీలో ఒక్కొక్కరూ ఒక్కొక్క రాష్ట్రానికి లీడర్‌గా ఉండాలి. అయితే, ఒక్క విషయాన్ని గుర్తుంచుకోండి. రాజకీయాలతో మీకు సంబంధం లేకుండా చూసుకోండి. సమాజాభివృద్ధిని కోరండి. దానికోసం మీరు ఎంతైనా పాటుపడండి. అదే గొప్ప తపస్సు. ప్రశాంతినిలయంలో ఉన్నంతవరకు మంచిగా ఉండి, బయటకు పోతూనే తోకలు తిప్పకూడదు. అది, 'మంకీ మైండ్' లక్షణం. మీరు 'డివైన్ మైండ్'తో ఉండండి. 'డీప్ వైన్'లో మునగకండి! అలాంటి పవిత్ర హృదయులైన యువతీయువకులు నాకు అత్యవసరం. వారందరూ నాకు సమీపులే. అలాంటివారే నా డియర్ ఫ్రెండ్స్. మీరు స్వామికి డియర్ ఫ్రెండ్స్ కావాలనుకుంటే, స్వామి చెప్పినట్లు నడుచుకోండి. అప్పుడు మీరిక్కడకు రానక్కరలేదు. నేనే మీవద్దకు వస్తాను. నేను మీతోనే ఉన్నాను. మీ లోపలున్నాను. వెలుపలున్నాను. మీ ముందు ఉన్నాను. వెనుక ఉన్నాను. ఇట్టి విశ్వాసాన్ని అభివృద్ధి పర్చుకోండి. నేను మీకంటే ప్రత్యేకంగా లేను. నేను, మీరు ఒక్కటే. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించి, దివ్యత్వాన్ని పొందటానికి మీరు ప్రయత్నం చేయండి. పవిత్రతను పెంచుకోండి. నిరంతరము దైవచింతన చేయండి. అప్పుడు మీరు అన్నివిధాలుగా అభివృద్ధిచెందుతారు.

(స్వామి 'పిబరే రామరసం...' మరియు 'వహెగురు..' అనే భజనలను పాడిన తరువాత ఉపన్యాసము కొనసాగిస్తూ)

'వహె గురు' అనగా ఒకే గురువు, ఒకే దైవం, ఒకే గమ్యం. ఇష్టంవచ్చినట్లు వారి వద్దకు, వీరి వద్దకు మీరు తిరగకూడదు. ఎలాంటి పరిస్థితియందైనా దైవమార్గమును విడిచిపెట్టకూడదు. 'గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః' అన్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపుడైన భగవంతుడే మీ గురువు. గుకారము గుణాతీత తత్త్వమును, రుకారము రూపరహిత తత్త్వమును సూచిస్తాయి. గుణాతీతుడు, రూపరహితుడు దైవం ఒక్కడే. కనుక, దైవమే మీ నిజగురువు. దైవమే మీ గమ్యము. దైవాన్ని అనుసరించినప్పుడే మీ జన్మ ధన్యము.

యువతీయువకులారా! మీరు అనేక వ్యయప్రయాసలకోర్చి ఇక్కడకు వచ్చినందుకు ఈ మూడు దినములలో నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టి తగిన ఫలితాన్ని పొందండి. మీరు మీ స్వస్థానములకు తిరిగి వెళ్ళిన తరువాత ఇక్కడ అనుభవించిన ఆనందాన్ని ఇతరులకు కూడా పంచిపెట్టటానికి ప్రయత్నించండి. మీరీ కాన్ఫరెన్సులో పాల్గొన్నందుకు తగిన ఫలితాన్ని మీ ప్రవర్తనలో నిరూపించండి. దీనులకు సహాయం చేయండి. సేవలో పాల్గొనండి. సేవకు మించిన సాధన మరొకటి లేదు. సంసార సాగరమును దాటాలంటే తపస్సువలనగాని, తీర్థయాత్రలవలనగాని, శాస్త్ర శ్రవణమువలనగాని సాధ్యం కాదు. నిష్కామ సేవవల్లనే జన్మ సార్థకమవుతుంది.

'నేను ఇన్ని గ్రామసేవలు చేశాను, నాకు ఈ ఫలితం రావాలి' అని ఆశిస్తే ప్రయోజనం ఉండదు. మీరు ఫలాపేక్షా రహితంగా సేవచేస్తూ ఉంటే, మీకు కావలసినది భగవంతుడే ఇస్తాడు.

ప్రేమస్వరూపులారా! మీరు అనేక దేశములనుండి ఇక్కడకు వచ్చి, అనానుకూలములను లెక్కచేయక ఎంతో ప్రేమతో ఈ కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. చాలా ఆనందము. ఇక్కడ మీకు తగిన ఆహారంకూడా దొరికి ఉండకపోవచ్చు. అయితే, మీరు ఆశించవలసినది 'ఫుడ్' కాదు. మొదట మీ 'హెడ్'లో పవిత్రమైన భావాలను పెట్టుకోండి. అప్పుడే మీకు 'గాడ్' లభిస్తాడు. మీరు ఆదర్శవంతమైన జీవితాన్ని, ఆనందమయమైన జీవితాన్ని గడపాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(1999 నవంబరు 21వ తేదీ యువకులకు భగవాన్ బాబావారి దివ్యసందేశము)